డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ ఈటల

జగద్గిరిగుట్ట: కేరళలో ఇటీవల జరిగిన ఆలిండియా క్లాసికల్ కూచిపూడి డ్యాన్స్ పోటీల్లో శ్రీ మానస స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. దీంతో అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతిభ చాటిన హర్షిత శ్రీవిద్య ప్రదీక్ష, హేమ, వర్షిత, సహస్రను ఎంపీ శాలువాతో సత్కరించి అభినందించారు. మల్లేశ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్

సుభాష్‌నగర్: సూరారం కట్టమైసమ్మ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా క్రేన్లు, కొలన్ల వద్దకు భక్తులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, సూరారం లా అండ్ ఆర్డర్ సీఐ సుధీర్ కృష్ణ తదితరులు ఉన్నారు.

ట్రికోతో ఇంజినీరింగ్ కళాశాల ఎంఓయూ



సుభాష్‌నగర్: దూలపల్లికి చెందిన సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ట్రికో రీసైక్లింగ్ కంపెనీతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ యాదవ్, డైరెక్టర్ డాక్టర్ కాస రవీంద్ర ట్రికో ఎగ్జిక్యూటివ్ అశ్విన్ జాదవ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీంతో కళాశాలకు చెందిన ఈ.వేస్ట్, పేపర్ వేస్ట్‌ను ట్రికో సంస్థ ఐదేళ్ల పాటు సేకరించి రీసైక్లింగ్ చేయనున్నది. కళాశాల ఆవరణను ఏకో ఫ్రెండ్లీగా తీర్చిదిద్దేందుకు ఈ ఒప్పందం దోహదపడనుందని యాజమాన్యం పేర్కొంది.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం భక్తులు మండపాల వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సంక్షేమ సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటలు నిర్వహించగా భక్తులు పోటీ పడ్డారు. ఆయా మండపాల వద్ద అన్నదానాలు చేపట్టి గణేశ్ విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. –కుత్బుల్లాపూర్



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో అన్నదానంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



జగద్గిరిగుట్టలోని శ్రీనివాసనగర్‌లో..



అపురూపా కాలనీలో లడ్డూతో ఎం.ఎస్.వాసు..



గాజులరామారంలో పూజల్లో కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్



మార్కేండయనగర్‌లో లడ్డూతో మార్కండేయ..



వేంకటేశ్వరనగర్ పూజల్లో జేకే శేఖర్‌యాదవ్



బాచుపల్లి నందనవనం కాలనీలో..

ముగిసిన మాతృభాష వారోత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత నెల 28న ప్రారంభమైన మాతృ భాష వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా 4, 5వ తరగతుల విద్యార్థులకు సుమతీ శతకం, వేమన శతకం పద్యాల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ప్రభావతి, సంస్థ కార్యదర్శి అప్పాజీ శ్రీనివాసు విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతృమూర్తిని, మాతృభాషను, మాతృదేశాన్ని, మాతృధర్మాన్ని ప్రేమిస్తూ, పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి ఎస్.ధాన్యశ్రీ, ద్వితీయ బహుమతి సీహెచ్.కార్తీక్, తృతీయ బహుమతి ఎస్.శ్రీనిధి, ఏ.ఆరాధ్య, పి.ధనుష్, డి.ధనుశ్రేయ్, తేజ్ కుమార్ బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో హేమశ్రీ, తనూజాశ్రీ, లక్షన్యాయ విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు టి.రామతులసీ, మంజులత, తార, పుష్పలత, శాంతి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

తాగునీరు సరఫరా చేయాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసనలో మహిళలు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని 16, 17వ వార్డులోని శ్రీవాణి స్కూల్ రోడ్డులో సుమారు 40 ఇళ్లకు తాగునీటి సరఫరా కావడం లేదని ఆ బస్తీ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలే పంచాయతీ నుంచి మున్సిపల్‌లో విలీనమైందని అయితే గ్రామ పంచాయతీ హయాంలో వేసిన పైప్‌లైన్ కావడంతో వారానికి ఒకసారి చాలీచాలని బోరు నీరు వదలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

‘మహీంద్ర యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలి’

దుండిగల్: బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్సిటీలో డ్రగ్స్ సేవిస్తూ ఆరుగురు విద్యార్థులు పట్టుబడిన ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరుతూ ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేశ్ దుండిగల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసులో ఆరుగురు విద్యార్థులకు పాజిటివ్ వచ్చినా యూనివర్సిటీ యాజమాన్యం ఇంతవరకు స్పందించడం లేదని ఆరోపించారు. సెక్యూరిటీ లోపించడంతో డ్రగ్స్ దందా, వాడకం కొనసాగుతోందని, యూనివర్సిటీ యాజమాన్యం నిర్వాకంతో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారని, దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నగేశ్

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి



హాజరైన ఉపాధ్యాయులు

కుత్బుల్లాపూర్: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉంటుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అన్నారు. ఉషోదయ కాలనీలోని ట్రస్మా కార్యాలయంలో 112 పాఠశాలల ఉపాధ్యాయులను కుత్బుల్లాపూర్ ఎంఈవో జెమినీ కుమారి, మేడ్చల్ జిల్లా ట్రస్మా కోశాధికారి పరశురామ్‌తో కలిసి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను, సంస్కారంతో కూడిన చదువును అందించే గురువుల మేలును విద్యార్థులు మరువద్దన్నారు. కుత్బుల్లాపూర్ మండల ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస చారి, మండల ప్రధాన కార్యదర్శులు గుజ్జుల తిరుపతిరెడ్డి, కొండేటి నర్సిరెడ్డి, కోశాధికారి కట్టె శ్రీకాంత్, దుండిగల్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అంబదాస్, కోశాధికారి సంజయ్, బాచుపల్లి మండల అధ్యక్షుడు ఆదినారాయణ, రాష్ట్ర బాధ్యులు వనజ అశోక్, డేనియల్, బాలరాజు, ఈశ్వర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు షబానా అఫ్రోజ్, ఉపాధ్యక్షులు ఛాయాదేవి, పవన్‌కుమార్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు!

కంచె లేక భయందోళనలో స్థానికులు

రంగారెడ్డినగర్: కంచెలు లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మూతల్లేని ఫ్యూజ్‌బాక్స్‌లు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో లో ఓల్టేజీ తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వందలాది ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అయితే చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. చిన్న పిల్లలకు సైతం అందేంత తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. అంతేగాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్‌బాక్స్‌లకు సంబంధించి వైర్ల ఇన్సులేషన్ పొర లేకపోవడంతో ఎవరైనా తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు పలు ట్రాన్స్‌ఫార్మర్ల చెంతనే ఇళ్ల వ్యర్థాలను డంప్ చేస్తుండంతో ఎవరైనా చెత్తకు నిప్పు పెడితే ఎక్కడ పేలుతాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదర్శ్‌నగర్‌లో చిన్నారులకు అందేలా ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేషన్ వైర్లు



నెహ్రూనగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏపుగా పెరిగిన మొక్కలు



పంచశీల కాలనీ ప్రధాన రోడ్డులో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



గిరినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చెంతనే చెత్త డంపింగ్



చింతల్ బస్టాప్ సమీపంలో రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం

- 17 చెరువుల్లో ఇప్పటి వరకు 33,477 విగ్రహాల నిమజ్జనం
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు
- అన్ని వసతులు కల్పించామన్న కలెక్టర్ మనుచౌదరి



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17 చెరువుల వద్ద గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా అన్ని రకాల వసతులను కల్పిస్తోంది. ఈనెల 27న గణనాథులు కొలువు దీరగా.. పదో రోజు 6న వినాయక నిమజ్జనానికి అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో 10 మంది సిబ్బంది..

ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్తు లైటింగ్, తాగునీటి వసతితో సహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజిన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయ్‌లెట్లు, టాయిలెట్లు సహా కనీస వసతులను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చెరువుల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా..

రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాధ్యతలను అప్పగించారు. నిమజ్జన ప్రాంతాలలోని చెరువులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు, డీఆర్ఓ, ఆర్డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 11 ఉండగా.. మిగతా ఆరు చెరువులు పురపాలక సంఘాల పరిధిలో ఉన్నాయి.
- జిల్లా వ్యాప్తంగా మూడు ఫీట్ల నుంచి మొదలుకుని 5 ఫీట్లకు పైగా ఉన్న వినాయక విగ్రహాలు దాదాపు 38,775 ప్రతిష్ఠించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించామని, 19 చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- 8వ రోజు బుధవారం నాటికి నిర్దేశించిన చెరువుల్లో భక్తులు 33,477 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతేడాది వినాయక ఉత్సవాల్లో భాగంగా 17 చెరువుల్లో 36,456 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.
- 5 ఫీట్లకు పైన ఉన్న వినాయక విగ్రహాలు 11,558 ఉండగా.. ఐదు ఫీట్ల కంటే తక్కువగా 24,898 విగ్రహాలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

చెరువుల వద్ద స్పెషల్ ఆఫీసర్లు..

గణేష్ నిమజ్జనానికి 17 చెరువుల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ప్రశాంతంగా జరిగేలా 17 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. స్పెషల్ ఆఫీసర్లుగా వెంకట్‌గోపాల్–(సుతారిచెరువు), చంద్రప్రకాష్ –(పెద్దచెరువు), సాబేర్‌అలీ–(ప్రగతినగర్ ట్యాంకు), రాజు–(నల్లచెరువు), నర్సింహ–(వెన్నెలగడ్డ చెరువు), మల్లయ్య–(పరికి చెరువు), ఇస్లావత్ –(ఐడీఎల్ ట్యాంకు), గంగాధర్–(హస్మత్‌పేట్ బొవెల్ చెరువు), స్వామి–(సున్నం చెరువు), ఎంఎస్ఆర్ జ్యోతి–(శామీర్‌పేట్ చెరువు), జాక్రియా సుల్తానా– (సఫిల్‌గూడ ట్యాంకు), శ్రీనివాస్‌రెడ్డి–(కొత్తచెరువు)లను కలెక్టర్ నియమించారు.

చెత్త డంపింగ్‌కు అడ్డాగా షాపూర్‌నగర్ రిజర్వాయర్!

చింతల్: షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ చెత్త డంపింగ్‌కు కేంద్రంగా మారుతోంది. వాటర్ వర్క్స్ ఆవరణలోని 7 ఎంఎల్ రిజర్వాయర్ పక్కనే ఎస్ఎల్‌బీ నగర్ బస్తీకి చెందిన నివాసాలు ఉన్నాయి. కాగా రిజర్వాయర్ ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో పలువురు స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను గోడపై నుంచి రిజర్వాయర్ ఆవరణలోకి విసిరేస్తున్నారు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఈ విషయమై స్థానికులకు పలుమార్లు చెప్పినా చెత్త వేస్తున్నారని జలమండలి సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి ప్రహరీ గోడ ఎత్తును పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రిజర్వాయర్ ఆవరణలో చెత్త

వాతావరణ సమతుల్యంలో సముద్రాలు కీలకం

రాయదుర్గం: వాతావరణ సమతుల్యంలో సముద్రాలు కీలకం అని, ప్రపంచంలో అతిపెద్ద పర్యావరణ వ్యవస్థగా ఉన్న మహాసముద్రాలను విధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత చీఫ్ సెక్రెటరీ ఎస్‌వి సుబ్రహ్మణ్యం అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చమురు లీకేజీలతో ఏర్పడుతున్న సముద్ర కాలుష్యాన్ని నివారించడం అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో నెలకొన్న అనేక పరిశ్రమల వ్యర్థాలు సముద్ర కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. ప్రపంచంలోని మహా సముద్రాలు భూమి ఉపరితలంపై 71 శాతం సముద్రపు నీటితో ఆక్రమించబడి లక్షలాది సముద్ర జాతులకు నివాసంగా నిలిచి, అపారమైన జీవవైవిధ్యాన్ని పోషిస్తున్నాయని గుర్తు చేశారు. సముద్రాలు భూమి ఉపరితలంపై ఉన్న కార్బన్ డయాక్సైడ్, వేడిని తీసుకుంటూ వాతావరణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తూ ఉన్నాయన్నారు. ‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ రసాయనాలు, పురుగుమందులు, భారీ లోహాలు, పరిశ్రమల వ్యర్థాలు సముద్రాల్లో పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నివారణకు ప్రభుత్వాల కన్నా ప్రజలే బాధ్యతగా వ్యవహరిస్తే సముద్ర కాలుష్యం ఉండదన్నారు. క్లైమేట్ చేంజ్, పర్యావరణం, వాటర్ రిసోర్సెస్, పవర్ అండ్ ఎనర్జీ తదితర విషయాలపై ఇక నుంచీ ప్రతి యేటా ఎస్కీ క్యాంపస్‌లో పదివేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్‌జే ప్రసాద్, వెంకట్‌రెడ్డి, సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ హెడ్ డా.చంద్రకళ, ఫ్యాకల్టీ డాక్టర్ ఆది నరేష్, చీఫ్ లక్ష్మీకాంతరావు, డా.రాజారావు, ఇతర విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించరూ..!

విద్యుద్దీపాలకు అడ్డుగా ఉన్న వైనం

చింతల్: ఐడీపీఎల్ నుంచి ఆజ్‌బెస్టాస్ అస్ కమాన్ వరకు రోడ్డు మధ్యలోని డివైడర్‌లో నాటిన కోనకార్పస్ మొక్కలు ఏపుగా పెరిగాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో విద్యుత్ దీపాల వెలుగుకు అడ్డుగా మారాయి. దీంతో ఐడీపీఎల్ నుంచి రోడ్డంతా చీకటిమయంగా మారుతోంది.



ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.